# ఆ...డపిల్ల

— వాలి హిరణ్మయీదేవి.

## "ఏంటి మేడమీద అల్లరి — సంజూ పైనే వుందా?"

## అడిగాడు జగన్నాథం.

"అవును బొమ్మల పెళ్ళి చేస్తోంది — ఇప్పుడు భోజనానికి మిమ్మల్ని పిలుస్తుందేమో గూడ" అంది శ్యామల నవ్వుతూ.

"అలాంటి పిచ్చి ఆటల నాడనిస్తావేం? ఇప్పట్నుండే పెళ్ళి — పేరంటం అంటూ ఏంటా వెధవ్వేషాలు" చిరాకుపడ్డాడు.

"అలాగనకండి చిన్నప్పుడు బొమ్మల పెళ్ళిళ్ళు చేస్తే — తగిన ఈడులోనే పెళ్ళవుతుందట. మా బామ్మ అలాగే చేయించేది కాబట్టే..."

"ఇలా నీతో ఇన్నేళ్ళుగా వేగవలసి వస్తోంది" అన్నాడామె మాటలు కడ్డొస్తూ.

"ఓ యబ్బ! అయితే ముసలయ్యాక పెళ్ళి చేసుకోవలసింది మరి" అంటూ మూతి విరిచింది శ్యామల.

ఇంతలో జారిపోతున్న కుచ్చెళ్ళను జారకుండా సతమతమవుతూ బుట్టబొమ్మలా వున్న ఆరేళ్ళ సంధ్య గదిలో అడుగుపెట్టింది.

"నాన్నగారూ — రండి భోంచేద్దురుగానీ" అంది.

"సంజూ! చదూకోకుండా ఈ పిచ్చి ఆట లేంట్రా — అయ్యయ్యో ఈ చీరేంటి — వేషమేంటి —గి కాళ్ళకు అడ్డుపడి పడిపోనూ" అన్నారు మురిపెంగా కూతుర్ని చూస్తు.

"అమ్మా — నాన్నమ్మా ఆడుకోవచ్చన్నారుగా మరి" అంది సంధ్య.

'సరే! ఈ రోజేం ఆడావో ఆడావ్ గానీ ఇక మీదట ఈ ఆట ఆడొద్దు. ఈ ఆటలాడితే గాని పెళ్ళి కాదా ఏం — నా తల్లికెంత మంచి మొగుడ్ని తెస్తానో చూసి లోకులు ముక్కున వేలేసుకోవాలి" అన్నాడు జగన్నాథం.

సంధ్యకి ఆ మాటలేమీ అర్థం కాలేదు."అబ్బ రండి — నాన్నగారూ! ఇంకా బోల్డుసమంది అక్కడ" అంది ఆరిందాలా.

నవ్వుతూ సంధ్య ననుసరించాడు జగన్నాథం.

* * *

"అలా బొట్టు మీద బొట్టు పెట్టకే సంజూ! ఒక్కో నామం చదువుతూ పెట్టిన చోట బొట్టు పెట్టకుండా పెడితే అలా అలా ఆంజనేయుడి పటం బొట్లతో నిండుతుంది. ఊ చదువు అంజనా నందం వరమ్ః, జానకీ శోకనాశనమ్ః — ఊ పెట్టు బొట్టు— కపీశ మక్ష హంతారామ్ః — ఇలా పక్కగా అంటేలా పెట్టు" అంటూ శ్యామల సంధ్యతో దగ్గరుండి పూజ జరిపిస్తోంది.

"శ్యామలా! ఏంటి మళ్ళీ దాని ప్రాణం తీస్తున్నావా? అయినా ఇదేం నమ్మకమోయ్! పెళ్ళి కాని బ్రహ్మచారి హనుమంతుడు. ఆయన పెళ్ళిళ్ళెందుకు జరిపిస్తాడసలు?" అన్నాడు విసుగ్గా జగన్నాథం.

"అసలు మిమ్మల్నీ పూజ గదిలోకెవరు రమ్మన్నారు? మీకు నమ్మకం లేకపోతే పోయింది గాని — మమ్మల్ని మా తంటాలేవో పడనీండి".

"నీ మాటే నీదే కదా! పెళ్ళి తప్ప ఆడపిల్లకు వేరే పరమార్థం లేనట్టు నువ్వు భావించడమే కాదు — సంజూ బుర్రను కూడా పాడుచేస్తున్నావ్" కోపంగా అన్నాడు. కూతురు ఉపవాసాలుంటే ముందాయనకు ముద్ద దిగదు.

"ఊర్కోండి ఇప్పుడు దాన్ని చదివించి కలెక్టర్ చేసినా — పెళ్ళి కానిది — పిల్లలు లేనిది — దాని బ్రతుక్కి సార్థకత లభిస్తుందా? మంచి మొగుడు దొరకడం కన్నా ఆడదాని కింకేం కావాలసలు" అంది కొబ్బరికాయ సంధ్య చేతి కందిస్తూ.

ఆ కొబ్బరి కాయ కొట్టి తల్లి చెప్పినట్టే భక్తిగా నమస్కరించి — తన గదిలోకి వెళ్ళిపోయింది పదహారేళ్ళ సంధ్య.

బాపూ బొమ్మలా — సన్నజాజి పూవులా నాజూగ్గా వున్న సంధ్యని కళ్ళ నిండా చూసు కుంటూ "నా తల్లికేం ఖర్మే — ఇలా ఉపవాసా లుంటూ పూజలు చేయడానికి. దీన్ని పొందేందుకు వాడెవడో — మంచి పూజ చేసుకుని వుండాలి గాని' అన్నాడు



18-5-90 ఆంధ్రజ్యోతి వారపత్రిక

జగన్నాథం.

ఆ మాటలకి ముసిముసిగా నవ్వుకొంది శ్యామల. తన బామ్మ ఇలాగే అనేది మరి.

* * *

"అబ్బాయ్ డాక్టర్. అందగాడు — సంపాదనా బాగానే వుంది. ఓ పదివేలు ఎక్కువయినా పర్లేదు. ఈ సంబంధం ఖాయమయ్యేలా చూడండి" అంది శ్యామల. పెళ్ళి కొడుకూ, అతని ఫామిలీ చాలా నచ్చాయామెకి.

"ఈ సంగతి సరేలే! సంజా — నీ మనసులోని మాట చెప్పరా. నీకు నచ్చితే ఖాయం చేస్తాను" అన్నాడు జగన్నాథం సంధ్యతో.


"నాన్నా! ఇప్పుడే ఇంత కట్నం అడిగితే ముందు ముందు ఇంకెన్ని అడుగుతారో! అసలింత కట్నం మన మిచ్చుకోలేం. ఇల్లమ్మితే ఆ తర్వాత మీరెక్కడుంటారు? నా కోసం మీరు హైరానా పడొద్దు" అంది మెల్లగా సంధ్య.

తమ మీద కూతురుకున్న ప్రేమకు కళ్ళు చెమర్చాయి జగన్నాథానికి.

"ఇల్లమ్మితే నేంరా! నీకో 'మంచి ఇల్లు' ఏర్పడుతుంటే. నేనూ, మీ అమ్మా ఏ రెండు గదులున్న ఇల్లు తీసుకున్నా సరిపోతుంది. అంతగా కాకపోతే స్థలం వుందిగా. రిటైర్ అయ్యాక వచ్చిన డబ్బుతో ఓ చిన్న ఇల్లు కట్టుకొంటాంలే. నీకా అబ్బాయి నచ్చితే చెప్పు. నీ సుఖం కన్నా మాకింకేం కావాలి. ఆ అబ్బాయిని పెళ్ళాడ్డం ఇష్టమేనా చెప్పు" అన్నాడు.

మెల్లగా తలూపింది సంధ్య.

పెళ్ళన పెళ్ళయింది. మూడ్నెల్లయినా గడవక ముందే సంక్రాంతొచ్చింది "అమ్మా! పండుగ కట్నంగా వారికి స్కూటర్ కావాలట" అంది




కాటూరి వెంకటేశ్వరరావుగారు మొదటిసారి 'సౌందరనందం' ప్రకటించినప్పుడు చాలా పుస్తకాలు చెల్లుబాటు కాలేదు. ఇంట్లోనే వుండి పోయాయి. ఒకసారి వాళ్ళింట్లో దొంగలు పడ్డప్పుడు ఏమీ దొరక్క ఈ పుస్తకాలు ఎత్తుకు పోయార్ట. ఆ రకంగానైనా పుస్తకాలు ఖర్చైనందుకు ఆనందంగా వుందని అన్నార్ట కాటూరి కవి.

— మధునామూర్తి

మెల్లగా సంధ్య. కూతురొచ్చిన సంబరమంతా ఆ మాట వినగానే ఎగిరిపోయింది శ్యామలకి.

"మరీ అంత ఖర్చు అంటే నాన్నగారెలా భరిస్తారే— అతనికి కాస్త నచ్చచెప్పకపోయావా" అంది కాస్త నిష్ఠూరంగా శ్యామల. చెబితే తనవంటి నిండా అయ్యే గాయాలు గుర్తొచ్చి మౌనం వహించింది సంధ్య. లోన్ తీసుకొని ఆ ముచ్చట తీర్చక తప్పలేదు జగన్నాథానికి.

మరో మూడ్నెల్లయినా గడవక ముందే ఉగాదొచ్చింది. "అమ్మా! ఈసారి టీవీ కావాలంటున్నారే" అంది సంధ్య అడగడానికి మనసొప్పకున్నా.

"అదేంటే — అంతంత సంపాదించుకొంటున్నాడుగా మీ ఆయన. ఇలాంటివి తన సంపాదనలో కొనుక్కోవాలి గానీ ఇలా అడుక్కోవడం ఏంటే!" అంది కాస్త కోపంగా. శ్యామలకి అల్లుడి మీద బాగా కోపం వస్తుందీ మధ్య. వచ్చినప్పుడల్లా — ఎప్పుడూ తిండి మొహం ఎరగని వాడిలా 'అది వెయ్యమను — ఇది తెమ్మనమను' అంటూ చేసే పురమాయింపులకు.

"తప్పేదేముంది — ఇక ముందు మనకింకెవరన్నా వున్నారేంటి" అనుకొంటూ టి.వి. కొనిచ్చాడు జగన్నాథం.

సంధ్య నెలతప్పడం — డెలివరీ కావడం జరిగింది. బారసాల నాడు అయిదు తులాల బంగారం పెట్టమంటూ గొడవ. "ఇదేంటే — పిల్లాడ్ని మా కోసం కన్నారా — ఏంటే" అంటూ మొత్తుకొంది శ్యామల.

"ఆ బంగారం ఇచ్చేదాకా మీ కూతుర్ని మీ ఇంటికి పంపిస్తానేమో చూడమంటూ లాక్కెళ్ళిపోయాడు సుగుణాకరం. కళ్ళ నీళ్ళు కక్కుకుంటూ భర్తని అనుసరించింది సంధ్య. ఆ వెళ్ళడం వెళ్ళడమే. మళ్ళీ సంధ్యను మాడిన బొగ్గులా మారాక చూశారు జగన్నాథం దంపతులు.

"పిల్లాడికి నీళ్ళు వేడి చేయాలని వెళ్ళింది. నైలెక్స్ చీరేమో అంటుకుపోయినట్టుంది" అంటూ బుడిబుడి రాగాలు తీస్తున్న అల్లుడి వంక పిచ్చి చూపులు చూస్తూ నిలబడిపోయింది శ్యామల.

సంధ్య శవం మీదపడి హృదయ విదారకంగా ఏడుస్తూ "చూశావా శ్యామలా! దానిచేత బొమ్మల పెళ్ళిళ్ళు చేయించిందీ — హనుమత్ వ్రతాలు చేయించిందీ — ఉపవాసాలు చేయించి నోములు నోయించిందీ ఇందుకేనా? ఆడపిల్ల ఆ...డపిల్లను కొంటూ — అందుకేనేమో — దూరంగా — ఆడకి— ఆ పైకి పోయింది" అంటూ ఏడుస్తున్న జగన్నాథం వంక ఆడపిల్లల తండ్రులు భయం భయంగా చూడసాగారు.

❋

